అల్లుళ్లే ఆప్తులయిన వేళ

ఉదయం భార్య ఇచ్చిన కాఫీ తాగి, పెరటి దొడ్లోకి దారితీసాడు ఏకాంబరం. చెట్ల పాదులన్నీ సరిచేసి, మధ్యమధ్యలో గడ్డి, పిచ్చి మొక్కల్ని పీకేస్తున్నాడు. చిక్కుడు, కాకర పందిళ్లు సరిచేసి, తీగలు పాకిస్తున్నాడు. విశాలాక్షి ఇంట్లో పనంతా పూర్తిచేసి, స్నానంచేసి, పూజ కూడా ముగించింది. వంట మొదలుపెట్టాలంటే ముందుగా కూరగాయలు వెదుక్కోవాలి. ఉన్నది ఇద్దరు మనుషులు. ఎంతలోకి చేస్తాలే... అనుకుంటూ భర్త జాడ ఎక్కడా కనిపించకపోయేసరికి పెరట్లోకి వచ్చింది.

"ఏం చేస్తున్నారండీ ఇంకా ఇక్కడ? వంట మొదలుపెడదామంటే కూరలు లేవు. బజారు కెళ్లి ఏమైనా తీసుకురండి" అంది.

"ఇందాకటి నుంచి పందిరంతా వెదికితే ఆరు దొండకాయలు దొరికాయి. మూడు కాకర కాయలు కోసాను. అదిగో ఆ గోంగూర మొక్కలకి పది ఆకులు వస్తాయి. వాటిని మాత్రం రేపటి కోసం ఉంచాను. పప్పులోకి సరిపోతాయి. ఈ రోజుకి కాకరకాయ పులుసుపెట్టి వండు. దొండకాయ కూరచెయ్యి. వేపుడు మాత్రం చేయకు. నూనెలు పోసి ఎక్కువ వేపుళ్లు చేసుకుని తింటే బి.పి. వచ్చి డాక్టర్ దగ్గరకి పరుగెత్తాలి. ఫీజులు, మందులంటూ అదో డబ్బు దండగ. నేను చెప్పినట్టు చేసావంటే ఇద్దరి

ఆరోగ్యాలూ బాగుంటాయి" అంటూ ఏకాంబరం ఆరోగ్యం గురించి ఉపన్యాసం ఇచ్చి, ఆ మూడు కాకరకాయలు, ఆరు దొండకాయలూ భార్య చేతిలో పెట్టాడు.

"ఇదెక్కడి విడ్డూరమండీ! ఇపుడు మనకి బి.పి.లు, షుగర్లూ లేవు కదా. వస్తాయని ముందే ఊహించుకుని తిండి కూడా సరిగా తినకుండా మానేయమంటారా ఏమిటి? రానురాను మీకు

తాటికోల పద్మావతి

మరీ పిసినారితనం ఎక్కువైపోతోంది."

"ఇలా చేయబట్టే ఇద్దరాడపిల్లలకూ పెళ్లిళ్లు చేసి అత్తవారింటికి పంపించాం. దుబారా ఖర్చులకు పోతే పెళ్లికాని ఆడపిల్లల్ని గుండెల మీద కుంపటిలా కూర్చోబెట్టుకుని నిత్యం ఏడ్చే

వాళ్ళం. చేసింది బడిపంతులు ఉద్యోగం. వచ్చే పెన్షన్ డబ్బులతోనే ఇల్లు గడుపుకోవాలి."

"ఆ చేసారు లెండి... దేశంలో మీరొక్కరే ఆడపిల్లల్ని కని పెళ్లి చేసినట్టు మాట్లాడతారు. మొన్న వినాయక చవితికి పెద్దమ్మాయిని, అల్లుడినీ పిలిచారు. పత్రి కొనకుండా ఊర్లో చెట్లన్నీ ఎక్కి కొమ్మలన్నీ విరిచి పత్రి పోగుచేసారు. పిండి వంటలన్నా చేయించారా అంటే అదీ లేదు. నూనె ఖర్చు లేకుండా కుడుములు, ఉండ్రాళ్లతో సరిపెట్టారు. అదేమంటే వినాయకుడికి అవే ఇష్టం, మనకోసం కాదు దేవుడికోసం చేయాలన్నారు. ఇక బట్టల విషయానికొస్తే ఇది మగవాళ్ల పండుగ. అందులో చవితి పండుగ. కొత్త బట్టలు కొనగూడదంటూ అల్లుడికి ఒక్కడికే ఇంట్లో ఉన్న పంచె, తుండూ పెట్టి, అమ్మాయిని ఉత్తచేతులతో పంపించారు. రేపు వచ్చే దీపావళికి ఇలా చేస్తే నేను మాత్రం ఊరుకొనేదిలేదు. ఇద్దరు కూతుళ్లని, ఇద్దరు అల్లుళ్లనీ పిలవాల్సిందే. బట్టలతో పాటు టపాకాయల ఖర్చు కూడా ఉంటుంది. మీకు ఇప్పటి నుంచీ చెబితేగానీ చెవికెక్కదు. వాళ్లున్న రెండురోజులైనా మీ పిసినారితనం మానుకొని జాగ్రత్తగా ఉండ" మంటూ భర్తని నాలుగు చివాట్లుపెట్టి, ఆ దొండకాయలు, కాకరకాయలూ తీసుకుని లోపలికి వెళ్లింది విశాలాక్షి.

భార్య వెళ్లినవైపు పళ్లుకొరుకుతూ చూసాడు ఏకాంబరం. దీపావళికి ఇద్దరు కూతుళ్లు, అల్లుళ్లనీ పిలవాలా? పిల్లలకి టపాకాయలు కొనాలా? వాళ్లు పిల్లలు కాదు... చిచ్చుబుడ్లు. వచ్చారంటే ఇల్లుపీకి పందిరేస్తారు. బంతాట ఆడి తలుపులు, అద్దాలూ పగలగొడతారు. దొడ్డంతా పరుగెత్తి మొక్కలన్నీ పీకి పాడుచేస్తారు. పొద్దున్న ఒక్కొక్కరికీ గ్లాసుడు పాలు కావాలని పేచీలు. పెద్దవాళ్లకి కాఫీలు, టీలు, టిఫిన్‌లు. భార్యచేత అవి చేయించమంటూ, ఇవి చేయించమంటూ ఆర్డర్లు జారీ. ఒకరికి బొబ్బట్లు అంటే ఇష్టం అంటారు. మరొకరికి కజ్జికాయలంటే ఇష్టం అంటారు. ఆ ఖర్చులు భరించడం నా వల్లకాదు. ఈసారి దీపావళి పండక్కి ఇంట్లో ఉండకుండా ఎక్కడికైనా వెళ్లిపోవాలి. ముందుగానే పథకం గురించి ఆలోచించి ఒక ప్లాన్ వేస్తున్నాడు ఏకాంబరం.

పండుగ పదిరోజులుందనగా ఉత్తరాలు వ్రాయమని పోరుపెట్టింది విశాలాక్షి. భార్య పోరు పడలేక పండక్కి రమ్మని ఉత్తరాలు వ్రాసాడు. అడ్రస్‌లు మాత్రం వ్రాయకుండానే పోస్ట్ చేసాడు. దీపావళి ఖర్చు ఎలాగైనా తప్పించుకోవాలని చూస్తున్నాడు ఏకాంబరం. పండుగ రెండు రోజులుందనగా ఊడిపడతారేమోనని అనుమానం వచ్చింది. ఇంటికి తాళంపెట్టి ఎటైనా వెళ్తే ఎలా ఉంటుందని ఆలోచించాడు. బంధువుల ఇంటికి వెళ్తే ఛార్జీలకు డబ్బు దండగ. ఉత్తరాల మీద అడ్రస్‌లు వ్రాయలేదు కదా! ఎలా వస్తారులే అనుకున్నాడు. ఉత్తరాలు వ్రాసి పడేసిన రెండురోజులకే చిన్న అల్లుడు ఏదో పనిమీద ఆ ఊరు వచ్చి, అత్తమామల్ని చూసిపోదామని ఊర్లో దిగాడు. పొద్దున్నే ఊడిపడుతున్న అల్లుణ్ణి అంతదూరాన్నుంచే చూసి, గబగబా లోపలికి వెళ్లిపోయాడు ఏకాంబరం. మంచంమీద పడుకుని దుప్పటి ముసుగుపెట్టి మూలుగుతున్నాడు. విశాలాక్షి లోపల ఏదో పనిమీద ఉంది. అల్లుడి మాట వినిపించగానే బయటికి తొంగిచూసింది.

"ఎంతసేపయిందయ్యా వచ్చి? అమ్మాయి కులాసానా... ఉండండి కాఫీ తెస్తా"నంటూ లోపలికి వెళ్లింది. కుర్చీలో కూర్చున్నాడు రాజా



రావు. మంచంలో నుంచి మూలుగులు వినబడుతున్నాయి. ఎవరబ్బా అక్కడ పడుకొన్నది... మామగారే అయిఉండవచ్చనుకున్నాడు. అత్తగారిచ్చిన కాఫీ గ్లాసు అందుకుంటూ మామగార్ని అడిగేసరికి అపుడు గుర్తుకొచ్చింది విశాలాక్షికి. మంచం దగ్గరికి వెళ్లి చూస్తే ఇంకేముంది? ముసుగుతన్ని పడుకున్నాడు ఏకాంబరం. "ఇప్పటిదాకా బాగానే ఉన్నారు కదండీ. అంతలోనే ఏం మాయదారి రోగం ముంచుకొచ్చింది?"

"ఇంకేముంది... ఒళ్లు కాలిపోతోంది. నాకు జ్వరం వచ్చింది. కాళ్లూ చేతులూ స్వాధీనంలో లేవు. ఎక్కడివక్కడ పట్టుకుపోయాయి. నాకు చికెన్‌గున్యా వచ్చింది. అమ్మో! నేను లేవలే" నంటూ శోకాలు పెట్టడం ప్రారంభించాడు.

విశాలాక్షి భర్తను తాకిచూసింది. శరీరం చల్లగానే ఉంది. ఆమెకి అర్థమైపోయింది. "సాయంత్రం డాక్టర్ దగ్గరికి తీసుకెళ్తాలెండి. ఇప్పటికి కళ్లుమూసుకుని పడుకోండి" అంది.

"దీపావళికి రమ్మని ఉత్తరాలు వ్రాసాము. అమ్మాయిని తీసుకుని నాలుగు రోజులు ముందే రావాలి" అంది విశాలాక్షి.

బిత్తరపోయాడు రాజారావు. "ఉత్తరాలా? ఎప్పుడు వ్రాసారు? మాకు అందనేలేదు."

"అందకపోవడం ఏమిటండీ. నేనే దగ్గరుండి స్వయంగా వ్రాయించాను. పోస్టల్ డిపార్ట్‌మెంట్‌వారి లోపం వల్ల అందకపోవచ్చు. పోనీలెండి ఇపుడు చెబుతున్నాను పండక్కి తప్పకుండా రావా"లంది.

"మామయ్యగారు ఒకపక్క చికెన్‌గున్యాతో బాధపడుతూంటే పండుగ ఏం చేసుకుంటాం లెండి. మరోసారి వస్తాంలే" అన్నాడు రాజారావు.

అల్లుడు అంటున్న మాటలు వింటూ దుప్పటి ముసుగులోనే నవ్వుకుంటున్నాడు ఏకాం

బరం. వచ్చిన పని పూర్తిచేసుకుని అటునుంచి అటే వెళ్లిపోతానంటూ బయలుదేరాడు రాజారావు. గేటుదాకా సాగనంపడానికి వచ్చింది విశాలాక్షి. భర్తకి వినిపించకుండా ఏదో చిన్నగా చెబుతుంటే రాజారావు అలాగేనంటూ తలఊపాడు. అల్లుడు వెళ్లిపోగానే తలుపులు వేసి లోపలికి వచ్చింది విశాలాక్షి.

దుప్పటి ముసుగుతీసి "ఇక లేవండి. అల్లుడు వెళ్లిపోయాడు" అంది. ఏకాంబరం లేచి కూర్చున్నాడు. "పదండి డాక్టర్ దగ్గరికి తీసుకెళ్తాను" అంది.

"ఎందుకు? అదొక డబ్బు దండగ. అదేపోతుందిలే" అన్నాడు.

"నిజంగా ఉంటేనే కదా పోవడానికి. ఉత్తరాలు వ్రాయమంటే వ్రాసారు. అవి చేరలేదంటే అర్థమేమిటి? వాటిమీద అడ్రస్‌లు వ్రాసి ఉండరు. అందుకే అవి అందలేదు. అల్లుడుగారు ఇంటికి రాబట్టి అసలు నిజం తెలిసింది. వాళ్లేమన్నా పరాయివాళ్లనుకున్నారా? డబ్బు కోసం మరీ ఇంత కక్కుర్తిపడుతున్నారు?"

"ఆ డబ్బేనే అన్నిటికీ ముఖ్యం. డబ్బు లేనివాడు దేనికీ కొరగాడు. దీపావళికి ఖర్చు తప్పింది చూసావా" అన్నాడు. ఆ వెయ్యిరూపాయలు వడ్డీకిస్తే నెలకి నాలుగు వందలొస్తాయన్నాడు.

"ఎలా తప్పుతుందిలే" అనుకుంది మనసులో. భర్త మనసు తెలిసిన విశాలాక్షి అంతకు సరిపడా ఆలోచనలు చేసి, సమయానికి అన్నీ జరిగేటట్లు చూస్తుంది. ఇద్దరిలో ఒక్కరైనా సజావుగా ఉంటే కొంతలో కొంత మేలు.

ఎలాగూ తనకి వంట్లో బాగోలేదని అల్లుడికి తెలిసింది కదా. పండక్కి రారులే అనుకొన్నాడు ఏకాంబరం. తెల్లవారితే నరక చతుర్దశి అనగా ముందురోజు ఉదయమే దిగారు ఇద్దరల్లుళ్లు, కూతుళ్లు, పిల్లలు. అంతా ఒకే ఊరిలో ఉండటంవల్ల ముందే కూడబలుక్కుని ప్రయాణమయ్యారు. "ఈసారి మీ నాన్నచేత నాకు సెల్‌ఫోన్ కొనిపెట్టించు. ఏదో చవకరకం బట్టలతో సరిపుచ్చాలని చూస్తే ఊరుకునేది లేదం"టూ ముందే చెప్పిఉంచాడు పెద్ద అల్లుడు.

"మరి నా సంగతేంటి? కొత్తగా పెళ్లయిన వాళ్లం. కనీసం కలర్ టీవీ అయినా ఇస్తాడా మీ నాన్న. ఎలా చెబుతావో ఏమో నీ ఇష్టం" అన్నాడు రాజారావు.

ఏకాంబరానికి వీళ్లందరినీ చూసేసరికి గుండెల్లో రాయిపడింది. "తాతయ్యా! మాకు టపాకాయలు తెచ్చావా" అంటూ పిల్లలిద్దరూ చుట్టుముట్టారు.

"సాయంత్రం అలా బజారుకి తీసుకెళ్లి కొనిపెడతారులే. గొడవ చేయకండి" అంది విశాలాక్షి.

"ఆ... ఆ... అలాగే" అన్నాడు ఏకాంబరం. కాఫీలు, టిఫిన్‌లు చేసి స్నానాలు ముగించుకున్నారు. ఈలోగా కూతుళ్ల సాయంతో వంట ముగించింది విశాలాక్షి.

ఏకాంబరం మళ్లీ చికన్‌గున్యా వంకతో

ఏడుస్తూ పోలీస్ స్టేషన్‌కి వచ్చాడు ఎనిమిదేళ్ల అభిషేక్. "ఏం బాబూ! తప్పిపోయావా?" అడిగాడు గుమ్మంలో ఉన్న కానిస్టేబుల్.

"కాదంకుల్! మా అమ్మా నాన్నా బజార్లో ఎక్కడో తప్పిపోయారు" మళ్లీ ఏడుపు లంకించుకున్నాడు అభిషేక్.

ముసుగుతన్ని పడుకున్నాడు. తండ్రితో ఎలా చెప్పాలా అంటూ కూతుళ్లిద్దరూ ఎదురుచూస్తున్నారు.

సాయంత్రం ఐదుగంటల వేళ ఒక రైతు చేతిసంచీ పట్టుకుని వచ్చాడు ఆ ఇంటికి. "ఏకాంబరంగారు ఉన్నారా?" అనగానే ఆయనతో పనేంటో చెప్పమన్నాడు రాజారావు.

"ఆయనకివ్వాల్సిన డబ్బు ఇచ్చిపోదామని వచ్చానండీ. ఒకసారి పిలుస్తారా?"

"ఏకాంబరంగారికి కాళ్లు స్వాధీనంలో లేవు. ఆయన మంచంలో ఉన్నారు. ఆ డబ్బేదో మాకే ఇవ్వండి. ఏకాంబరంగారు మా మామగారే" నని చెప్పారు అల్లుళ్లు.

ఓరి వీడి దుంపతెగ. ఇప్పుడే రావాలా? డబ్బు చూసారంటే ఇంకేమైనా ఉందా? "ఎవరదీ" అంటూ లేచివచ్చాడు ఏకాంబరం.

"అయ్యా! నేను పొలం అమ్మేసానండీ. మీకివ్వాల్సిన పదివేలు వడ్డీతో సహా లెక్కచూసి తెచ్చాను. ఇదిగో మీ డబ్బు తీసుకుని నా పత్రం నాకిచ్చారంటే వెళ్లిపోతాను."

గుండెల్లో రాయిపడింది ఏకాంబరానికి. నోటు తేవడానికి లోపలికి వెళ్లాడు. డబ్బు లెక్కపెట్టమంటూ చేతికిచ్చాడు ఆ రైతు. చిన్నల్లుడు తీసుకుని నోట్లకట్టలు లెక్కిస్తున్నాడు. ఏకాంబరం నోటు తెచ్చిచ్చాడు. "డబ్బు సరిపోయింది. చూసారా... మామగార్కి మనం వస్తామని ముందే తెలుసు. నీకు సెల్‌ఫోన్, నాకు కలర్ టీవీ కొంటానికి ముందే డబ్బు రెడీ చేసుకున్నారు. కూతుళ్లమీద ఆయనకి అంత ప్రేమ. పిల్లలూ మీకు టపాకాయలు రెడీ. రేపంతా కాల్చుకోవచ్చు" అన్నాడు రాజారావు.



అల్లుడి మాటలు ఆటంబాంబులా పేలాయి. ఎగిరి అంత దూరాన పడ్డట్టయింది ఏకాంబరం పని. విశాలాక్షి వచ్చి ఆ నోట్ల కట్టలు తీసుకుంది. పెద్దల్లుడి చేతిలో ఐదువేలు, చిన్నల్లుడి చేతిలో ఐదువేలు పెట్టి, "మీకు కావలసినవి కొనుక్కోండి. పిల్లలకి బట్టలు, టపాకాయలు అన్నీ మీరే చూసి తెచ్చుకోండి. సాయంత్రం అయింది కదా బజారు వెళ్లిరండి" అంది.

ఏకాంబరానికి నోట మాట రాలేదు. చేసేదేమీ లేక ఇచ్చిన డబ్బు ఎటూ తిరిగిరాదని తెలుసుకుని, మనసులో బాధ కనిపించకుండా... "సరే మీ ఇష్టం బాబూ... మీ అత్తగారు చెప్పినట్టే చేయండి" అన్నాడు.

మన రొట్టె విరిగి నేతిలో పడిందన్నాడు రాజారావు. కాదు తేనెలోనే పడిందన్నాడు తోడల్లుడు. ఏకాంబరం తప్ప అందరి ముఖాలూ సంతోషంతో దీపావళి చిచ్చుబుడ్డిలా వెలిగిపోతున్నాయి.

నరక చతుర్దశి రోజు చీకటితోనే లేచారందరూ. టపాకాయల శబ్దాలతో ఇల్లంతా మోత మోగిపోయింది. ఆ చప్పుళ్లు వినలేక చెవులు మూసుకున్నాడు ఏకాంబరం. పిల్లలిద్దరి గోల, అరుపులతో దద్దరిల్లిపోయిందా ఇల్లు. విశాలాక్షి పిండివంటలతో బిజీగా ఉంది. అల్లుళ్లిద్దరి ఆనందానికి అవధులు లేవు. తలంట్లు, కొత్త బట్టలు, పిండివంటలతో భోజనాలు సుష్టుగా చేసారు. ఆ రోజు గడిచిపోయింది. మర్నాడు దీపావళి. సాయంత్రం ఇల్లంతా ప్రమిదలు వెలిగించారు. గోడలమీద, గేట్లమీదా పెట్టారు. టపాకాయల బుట్ట ముందర పెట్టుకుని చిచ్చుబుడ్లు, ఆటంబాంబులు అల్లుళ్లు, పిల్లలూ అంతా కలిసి పేల్చారు. టపాకాయల కోసం అన్ని రూపాయలు ఖర్చుపెట్టి వాటిని కాల్చుతూంటే ఏకాంబరం నోట్ల కట్టల్ని కాల్చినంతగా బాధపడిపోయాడు. రాత్రి పదకొండు గంటలదాకా పేల్చుతూనే ఉన్నారు. వాళ్లతో చేరి విశాలాక్షి కూడా చిన్నపిల్లలా టపాకాయలు కాల్చింది. "మీరూ రండి... ఇవిగో ఈ మతాబులు వెలిగించండి. పిల్లలు సరదాగా కాలుస్తుంటే చూసి ఆనందించాలి గానీ వంటరిగా ఇంట్లో పడుకుని ఏం చేస్తా"రంటూ విశాలాక్షి నాలుగు చివాట్లు పెట్టింది.

"ఇదంతా నువ్వు చేసిన నిర్వాకం. వాళ్లని పండక్కి పిలవడం, వచ్చిన పదివేలూ వాళ్లకిచ్చి ఖర్చుపెట్టుకోమనడం... ఎన్నాళ్లు కూడబెడితే పదివేలు పోగవుతాయి?"

"సంపాదించింది ఖర్చు పెట్టడానికే. మన పిల్లల కోసం మనం ఖర్చుపెట్టుకున్నాం. ఈ సరదాలు మళ్లీ వస్తాయా? మన పిల్లలకి పెట్టకపోతే పరాయివాళ్లకి పెడతామా? మీ చేతిలో పడితే ఆ డబ్బు వాళ్లకివ్వరు. అందుకని నేనే తీసుకుని ఇచ్చాను. మనం పెద్దవాళ్లమయ్యాం. మనకి ఎటూ ఆ సరదాలు రావు. పోయేటపుడు ఏదీ పట్టుకుపోలేం. ఒకరికయినా పెట్టే గుణం ఉండాలి" అంది.

"నీకేం... నువ్వు ఎన్నయినా చెబుతావులే. నీకేం తెలుస్తుంది డబ్బు విలువ? అది నా కష్టార్జితం." అల్లుళ్లు వింటారని అంతటితో ఆపేసింది విశాలాక్షి.

★ ★ ★

తెల్లవారి ఏడుగంటలు దాటినా ఏకాంబరం లేవలేదు. జ్వరంతో మూలుగుతున్నాడు. ప్రయాణానికి అంతా బయలుదేరారు. "ఏమండీ... నిజంగా జ్వరమేనా!" అంటూ చూసింది విశాలాక్షి. వళ్లు జ్వరంతో కాలిపోతోంది.



రాజారావు వెంటనే ఆటో పిలిచాడు. ఏకాంబరాన్ని హాస్పటల్‌కి తీసుకెళ్లాడు. డాక్టర్ పరీక్ష చేసి చికన్‌గున్యా అని చెప్పాడు. ఫరవాలేదు తగ్గిపోతుందంటూ మందులు వ్రాసి ఇచ్చాడు. నేను తెస్తానంటే నేను తెస్తానని అల్లుళ్ళిద్దరూ పోటీలుపడి మందులు కొన్నారు. హార్లిక్స్‌లు, బత్తాయి పళ్లు తెచ్చి ఏకాంబరాన్ని ఎంతో శ్రద్ధగా చూసుకున్నారు. డాక్టర్ ఫీజు చెల్లించేసి ఇంటికి తీసుకొచ్చారు. “మామగారూ! మీరు బాగా రెస్ట్ తీసుకోండి. వేళకి మందులు వేసుకోండి. వారం రోజుల్లో పూర్తిగా నయమైపోతుంది. మీరేం దిగులుపడొద్దు. కావాలంటే మీ అమ్మాయిల్ని ఉంచి వెళతాం” అన్నారు.

వాళ్లు చూపిస్తున్న ప్రేమాభిమానాలకు ఏకాంబరం కళ్లు చెమర్చాయి. హాస్పటల్ ఖర్చంతా వాళ్లే భరించారు. కూతుళ్లు సేవలు చేయడానికి సిద్ధపడ్డారు. తను వాళ్లని పండక్కి పిలిస్తే డబ్బు ఖర్చవుతుందని ఆలోచించాడు. వాళ్లున్న ఈ రెండు రోజులూ సరదాగా గడిచిపోయాయి. నిజంగా ఇలాంటి అల్లుళ్లుండడం అదృష్టం అనుకున్నాడు.

పదిరోజుల్లో ఏకాంబరానికి జ్వరం తగ్గిపోయింది. కొద్దిగా కాళ్లు, చేతులూ నొప్పిగా ఉన్నాయంటున్నాడు. కూతుళ్లు నాలుగురోజులుండి వెళ్లిపోయారు. విశాలాక్షి భర్తని అంటిపెట్టుకుని వేళకు అన్నీ అమరుస్తోంది. “చూసారా! మీ పిసినారి బుద్ధికి మీ అల్లుళ్లే పరాయి వాళ్లలా అన్పించారు. కానీ కష్టపు వేళలో ఆ అల్లుళ్ళే ఆప్తుల్లా మిమ్మల్ని ఆదుకున్నారు” అంది.

“నిజమేనే! అల్లుళ్లు నా కళ్ళు తెరిపించారు. ఇంకెప్పుడూ ఇలాంటి పిచ్చి పిచ్చి వేషాల్తో నా అల్లుళ్ళను దూరం చేసుకోవాలనుకోను బుద్ధొచ్చింది.” అంటూ చెంపలేసుకున్నాడు.

“అదీ... అలారండి దారికి” అంది నవ్వుతూ విశాలాక్షి. ఆమెనవ్వుతో ఏకాంబరమూ శృతి కలిపాడు. ఆ ఇంట్లో దీపావళి మతాబుల వెలుగులు అప్పుడు కన్పించాయి. ●